సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024

I



జీవశాస్త్రం.. భవితకు సోపానం

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ.. విద్యార్థుల భవిష్యత్‌కు సోపానంగా నిలవనుంది. ఈ శిక్షణలో జిల్లాలోని జీవశాస్త్రం ఉపాధ్యాయులు నూతన అంశాలు నేర్చుకున్నారు. IIలో



రాజన్నకు భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను గురువారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.2/20.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రెమా రాజేశ్వరి బదిలీ.. ఇన్‌చార్జి సీపీగా తరుణ్‌జోషి

- ఉమెన్ సేఫ్టీ డీఐజీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు



రెమా రాజేశ్వరి



తరుణ్‌జోషి

గోదావరిఖని: రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరిని బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా గురువారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీగా నియమించారు. ఆమెస్థానంలో ఇంకా ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఇన్‌చార్జి సీపీగా మల్టీజోన్–2 ఐజీ డాక్టర్ తరుణ్‌జోషి కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెమా రాజేశ్వరి బదిలీ ఆదేశాలు రావడం నెల వ్యవధిలో ఇది రెండోసారి. గత నెల 3న రెమా రాజేశ్వరిని ఉమెన్ సేఫ్టీవింగ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమెస్థానంలో ఎల్ఎస్ చౌహాన్‌ను నియమించారు. కొద్దిరోజులకే బదిలీ ఉత్తర్వులు రద్దు చేసినట్లుగా ప్రచారం జరిగింది. ఈవిషయాన్ని మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. గతేడాది జనవరి 27న బాధ్యతలు చేపట్టిన రెమా రాజేశ్వరి ఏడాదిపాటు రామగుండం పోలీస్‌కమిషనర్‌గా కొనసాగారు. ఇన్‌చార్జి సీపీ తరుణ్‌జోషి గతంలో గోదావరిఖని సబ్‌డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు.

ఏఆర్ అడిషనల్ డీసీపీ బదిలీ



రియాజ్‌హుల్‌హక్

గోదావరిఖని: రామగుండం కమిషనరేట్ ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్‌హుల్‌హక్ గురువారం బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఆయనను నారాయణపేట్ జిల్లాకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

చిన్నారులను భావిపౌరులుగా తీర్చిదిద్దాలి



సామూహిక జన్మదిన వేడుకల్లో డీడబ్ల్యూవో

రామగుండం: చిన్నారులను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని జిల్లా సంక్షేమాధికారి ఎండీ.రౌఫ్‌ఖాన్ అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని తబితా ఆశ్రమంలోని చిన్నారులకు నిర్వహించిన సామూహిక జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆశ్రమంలోని చిన్నారులకు చేయూతనందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ మాతంగి నర్సయ్య 79వ జయంతి పురస్కరించుకొని ఆయన కొడుకులు మాతంగి సునీత, ఉదయ్, అజయ్ తదితరులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అందరికీ నూతన వస్త్రాలు అందించారు. మరుపెల్లి నవీన్ మిత్ర బృందం దుప్పట్లు, రగ్గులు అందజేశారు. అనంతరం చిన్నారులతో కేక్‌కట్ చేయించి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. నగరపాలక కమిషనర్ కె.నాగేశ్వర్, కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, ఆర్‌జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, గోసిక శ్యాం, మద్దెల దినేష్, ఆంజనేయప్రసాద్, వీరారెడ్డి, కమలాకర్, సుగుణ, ఆవునూరి రాజేశం, చెల్పూరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన అప్పన్నపేట విండో చైర్మన్



సంపత్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట సహకారసంఘ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతపండు సంపత్‌తో పాటు పలువురు డైరెక్టర్లు కాంగ్రెస్ తీర్థం తీసుకున్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు సంపత్ సహా పలువురు డైరెక్టర్లకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సంపత్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఎస్పీ పార్టీలో కొనసాగారు. అవిశ్వాస తీర్మానంతో అనూహ్యంగా అప్పన్నపేట సహకార సంఘ చైర్మన్‌గా ఎన్నికైన విషయం విదితమే. సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన సంపత్‌ను పెద్దపల్లి చెందిన కాంగ్రెస్ నాయకులు ఉప్పు రాజు, ఎడెల్లి శంకర్, మందల సత్యనారాయణరెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేర్పించారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్..



రైల్వేకు పెద్దపీట

ఉమ్మడి జిల్లాకు రూ.673.43 కోట్లు

- గతేడాది రూ.647 కోట్లు
- మనోహరాబాద్–కొత్తపల్లికి రూ.350 కోట్లు
- కాజీపేట–బల్లార్షా మూడోలైన్‌కు రూ.300 కోట్లు
- మణుగూరు–రామగుండం కోల్‌కారిడార్ లైన్‌కు రూ.5 కోట్లు
- ఊసేలేని తిరుపతికి అదనపు సర్వీసులు
- పెద్దపల్లి–నిజామాబాద్ డబ్లింగ్‌కు కలగని మోక్షం

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కేంద్రం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం పెరిగింది. గతేడాది కేటాయించిన రూ.647 కోట్ల కంటే స్వల్పంగా పెంచింది. రూ.673.43 కోట్లు కేటాయించింది. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌కు పెద్దపీట వేసింది. గతేడాది రూ.185 కోట్లు కేటా యించగా ఈసారి ఏకంగా రూ.350 కోట్లు కేటాయించడం, కాజీపేట–బల్లార్షా మూడోలైన్ కోసం రూ.300 కోట్లు ఇస్తామని ప్రకటించడం విశేషం.

కొత్తపల్లి–మనోహరాబాద్‌కు రూ.350 కోట్లు

ఉమ్మడి జిల్లా వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ పనుల కోసం కేంద్రం రూ.350 కోట్లు కేటాయించింది. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.112 కోట్ల వరకు వెచ్చించాలి. గతేడాది రూ.185 కోట్లను మాత్రమే కేటాయించడం గమనార్హం. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని 2016లో కేంద్రాన్ని ఒప్పించింది. రూ.1,167 అంచనా వ్యయంతో ప్రారంభించి ఇప్పటి వరకూ మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు లైన్ పూయి, రైలుసేవలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 151 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం ఇప్పటి వరకూ 75 కి.మీ పూర్తయింది. ప్రస్తుతం సిరిసిల్ల–సిద్దిపేట(37 కి.మీ) భూసేకరణలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ నిధులతో సమసిపోనున్నాయి.

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల కేటాయింపులు ఇలా..

కొత్తపల్లి– మనోహరాబాద్ (148.9 కిమీ) : రూ.350 కోట్లు

కాజీపేట– బల్లార్షా మూడోలైన్ : రూ.300 కోట్లు

బల్లార్షా–రామగుండం ఎలక్ట్రిక్ అప్‌గ్రేడేషన్ : రూ.18.43 కోట్లు

మణుగూరు–రామగుండం (200 కి.మీ) : రూ.5 కోట్లు

మందమర్రి–రాఘవాపురం : రూ.5 లక్షలు

రాఘవాపురం–రామగుండం (ఆర్వోబీ): రూ.10,000

పెద్దపల్లి–కరీంనగర్–నిజామాబాద్ (177 కి.మీ): రూ.1000

పెద్దపల్లి బైపాస్–కరీంనగర్ లైన్ (2.169 కి.మీ)

కనెక్ట్ బల్లార్షా– కాజీపేట మెయిన్‌లైన్ : రూ.1000

కొలనూరు– పెద్దపల్లి–ఆర్వోబీ: రూ.10,000

కాజీపేట–బల్లార్షా మూడోలైన్ రూ.300 కోట్లు

కాజీపేట–బల్లార్షా మూడోలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించింది. గతేడాది రూ.450 కోట్లు కేటాయించిన కేంద్రం ఈసారి పనులు పూర్తవుతున్న నేపథ్యంలో రూ.300 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే ఈ మార్గంలో మూడు లైన్లలోనూ రైళ్లు తిరుగుతుండడం విశేషం.

రామగుండం–మణుగూరుకు రూ.5 కోట్లే

కోల్‌కారిడార్‌గా పిలుస్తోన్న రామగుండం(రాఘవాపురం)–మణుగూరు రైల్వేలైన్‌కు ఈసారి నిధులు తగ్గాయి. రామగుండం– మణుగూరు మధ్య ప్రస్తుతం ఉన్న 290 కి.మీలను 200 కి.మీలకు తగ్గించేందుకు భూపాల్లి మీదుగా వేస్తున్న ఈలైన్ అంచనా విలువ రూ.3వేల కోట్లు. 2022 డిసెంబరులో ఈ మార్గానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఎంతో ఆర్థిక ప్రాముఖ్యత ఉన్న ఈలైన్‌కు ఇంత తక్కువ కేటాయించడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

పెద్దపల్లి బైపాస్‌కు..

పెద్దపల్లి–కరీంనగర్ మార్గాన్ని కాజీపేట–బల్లార్షా మార్గంతో కలుపుతున్న పెద్దపల్లి బైపాస్‌లైన్‌కు రూ.1000 కేటాయించారు. ఈ మార్గంలో పనులు వేగిరమైనప్పటికీ భూసేకరణ, స్టేషన్ నిర్మాణ పనులు ఇప్పటికే ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రూ.1000 కేటాయించడం గమనార్హం.

ఊసేలేనివి ఇవే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిమాండ్ ఉన్న కరీంనగర్–తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల పెంపుపై కేంద్రం ఎలాంటి ప్రకటన చేయకపోవడం నిరాశకు గురిచేసింది. వాస్తవానికి ఈ రైళ్లలో కోచ్‌లు సరిపోక కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, మంచిర్యాల, మందమర్రి నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి–నిజామాబాద్ డబ్లింగ్ పనులకు బడ్జెట్‌లో చోటు దక్కకపోవడం గమనార్హం.



ఉత్తుత్తి బడ్జెట్



కేంద్రం బడ్జెట్ కేటాయింపులు అంతా ఎన్నికల జిమ్మిక్. ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేవు. కాంగ్రెస్ హయాంలో నేను తెచ్చిన తిరుపతి రైలు కనీసం సర్వీసులు కూడా పెంచలేదు. మణుగూరు – రామగుండం కోల్ కారిడార్ కు రూ. 5 కోట్లు ఇవ్వడం ఏంటి? ఇలా అయితే ఈ ప్రాజెక్టులు ఎన్నడు పూర్తవుతాయి? ఇదంతా ఉత్తుత్తి బడ్జెట్. – పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి

త్వరలో తిరుపతి రైళ్లపై..



గతేడాది కంటే ఈసారి దాదాపు రూ.30 కోట్ల బడ్జెట్ పెరిగింది. ఉమ్మడి జిల్లాకు కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనం. తిరుపతి రైళ్ల విషయంలో త్వరలో ప్రకటన చేయిస్తాం. అమృత్ పథకం కింద కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లను ఆధునీకీకరిస్తున్నాం. జిల్లాకు నిధులు పెంచడంలో కీలకంగా వ్యవహరించిన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు కృతజ్ఞతలు. – బండి సంజయ్, ఎంపీ

అందుబాటులోకి తేవాలి



మనోహరాబాద్–కొత్తపల్లి పనులను నేను ఎంపీగా ఉన్న సమయంలో ప్రారంభించాం. ఈసారి రూ.350 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. ఉమ్మడి జిల్లా వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టును మేం సిద్దిపేట వరకు తీసుకొచ్చాం. ఒప్పందం ప్రకారం 2025 డిసెంబరు నాటికి కరీంనగర్ వరకు అందుబాటులోకి తేవాలి. – వినోద్, మాజీ ఎంపీ

మంథని మున్సిపల్‌లో ముసలం

- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు పదవీగండం?
- అవిశ్వాసం యోచనలో కౌన్సిలర్లు
- కాంగ్రెస్‌లోకి ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- క్యాంపునకు తరలిన తొమ్మిది మంది?



మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మంథని: మంథని మున్సిపాలిటీలో ముసలం నెలకొంది. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను పదవీగండం వెంటాడుతోంది. వారిపై అవిశ్వాసం పెట్టే యోచనలో కౌన్సిలర్లు ఉండగా గురువారం ఏడుగురు కౌన్సిలర్లు గులాబీ గూటిని వీడి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో హస్తం కండువా కప్పుకున్నారు. తొమ్మిది మంది కలిసి అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస లేఖను అందించారు. అనంతరం వారు క్యాంపునకు వెళ్లగా.. మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్టశైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్‌కు పదవీగండం తప్పేలా లేదని స్థానికంగా చర్చ జరుగుతోంది.

మారుతున్న రాజకీయం

నూతన ప్రభుత్వం ఏర్పాటుతో మంథని నియోజకవర్గంలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కీలకమైన మంత్రి పదవి చేపట్టడంతో పావులు వేగంగా కదులుతున్నాయి. కమాన్‌పూర్ జెడ్పీటీసీగా గెలిచిన పుట్టమధు జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పుట్ట శైలజ పదవిలో కొనసాగుతున్న నేపథ్యంలో వారిని ఎలాగైనా గద్దె దించాలనే వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గతనెలలో జెడ్పీ చైర్మన్ పుట్టమధుపై అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నించారు. తాజాగా పుట్టమధు సతీమణి పుట్టశైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్‌కు వ్యతిరేకంగా గురువారం తొమ్మిది మంది కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీకి అందించారు.

కాంగ్రెస్‌లోకి ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు

బీఆర్ఎస్‌కు కౌన్సిలర్లు ఏడుగురు గురువారం హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కౌన్సిలర్లు సీపతి బానయ్య, వడ్లకొండ రవి, కుర్ర లింగయ్య, గుండా విజయలక్ష్మి పాపారావు, కొట్టె పద్మ రమేశ్, వేముల లక్ష్మీ సమ్మయ్య, నక్క నాగేంద్ర కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మున్సిపాలిటీలో 13మంది కౌన్సిలర్లకు కాంగ్రెస్ నుంచి పెండ్రు రమాదేవి, చొప్పకట్ల హనుమంతరావు ఉండగా తాజాగా ఏడుగురు చేరడంతో వారిసంఖ్య తొమ్మిదికి చేరింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసానికి తీర్మానిస్తూ తొమ్మిది మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన లేఖను అదనపు కలెక్టర్‌కు అందించారు.



అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస లేఖ అందిస్తూ..

క్యాంపునకు కౌన్సిలర్లు?

మంథని మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాస నోటీసులు అందించిన కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లినట్లు సమాచారం. అదనపు కలెక్టర్‌కు అవిశ్వాసలేఖ అందించిన సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరితో పాటు బీఆర్ఎస్ నుంచి వచ్చిన మరో ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే కనిపించారు. మిగితా కౌన్సిలర్లు హైదరాబాద్‌లోనే ఉన్నట్లు సమాచారం. గత పరిణామాల నేపథ్యంలో పకడ్బందీ వ్యూహంతో కౌన్సిలర్లను క్యాంపునకు తరలించినట్లు తెలుస్తోంది.

నులిపురుగు నియంత్రణకు చర్యలు

- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: నులిపురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం డీఎంహెచ్ ప్రమోద్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. నులిపురుగుతో రక్తహీనతతో పాటు అనేక ఆరోగ్యసమస్యలు ఏర్పడతాయని అన్నారు. 19ఏళ్లలోపు వయస్సుగల వారందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. ఈనెల12న ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ మాత్రలు అందించాలని సూచించారు. ఆ రోజు అందుబాటులో లేనివారికి 19న ఇవ్వాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి, జిల్లా ప్రభుత్వాసుపత్రుల సూపరింటెండెంట్ రమాకాంత్, రవిసింగ్, అప్పారావు, డీఈవో మాధవి, ఇంటర్ నోడల్ అధికారి కల్పన, డీపీవో చంద్రమౌళి ఉన్నారు.

కుష్ఠు నివారణకు కార్యాచరణ

కుష్ఠు నివారణకు పక్కా కార్యాచరణ రూపొందించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. జిల్లాలో వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు స్పెషల్‌డ్రైవ్ ఈనెల 13వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షణాలు కనిపిస్తే స్థానిక వైద్యాధికారిని సంప్రదించాలన్నారు.ప్రజల్లో అవగాహన పెరిగేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

మహిళల రక్షణకే షీటీం

షీటీం బృందాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. కలెక్టరేట్‌లో పీహెచ్ఎస్ హెచ్ యాక్టుపై మహిళా ఉద్యోగులకు పోలీసుశాఖ సమన్వయంతో అవగాహన కల్పించారు. పనిచేసే ప్రాంతాల్లో మహిళలు 10మంది కన్నా ఎక్కువ ఉంటే వేధింపులను ఎదుర్కొనేందుకు కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పెద్దపల్లి సీఐ కృష్ణ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీటీం బృందాలు పనిచేస్తున్నాయని అన్నారు. సెల్‌నంబరు 6303923700కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎస్ఐలు రాజేంద్రప్రసాద్, శివాని, కో–ఆర్డినేటర్ దయ అరుణ, జెండర్ స్పెషలిస్టు సుచరిత, స్వప్న పాల్గొన్నారు.

ఎన్టీపీసీ తెలంగాణ స్టేజ్–1 రెండో యూనిట్‌లో ఉత్పత్తి



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఆవరణలో నిర్మిస్తున్న తెలంగాణ ప్రాజెక్టు స్టేజ్–1లోని 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండో యూనిట్ గురువారం వేకువజామున విద్యుత్ ఉత్పత్తి దశలోకి చేరుకుంది. మూడు రోజుల క్రితం ఈ యూనిట్ బ్రాయిలర్ లైట్‌ఆఫ్ చేసి ప్రారంభించారు. గురువారం ఉదయం 800 మెగావాట్ల 2వ యూనిట్‌ను సింక్రనైజేషన్ దిశకు తీసుకురాగా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. దీనిని విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. గురువారం రాత్రి వరకు 400 మెగావాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరిగింది. రెండు రోజుల్లో 800 మెగావాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తికి చేరుకోనుందని అధికారులు తెలిపారు. ఎలాంటి ఆటంకం లేకుండా ఉత్పత్తి కొనసాగుతోందని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. రెండో యూనిట్‌లో 800 మెగావాట్ల పూర్తిస్థాయి విద్యుత్‌ఉత్పత్తి దశలోకి చేరుకున్న వెంటనే సీవోడీ చేసే అవకాశాలు ఉన్నాయి.

1,22,489.10 మె.ట యూరియా ఉత్పత్తి



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో జనవరి 2024లో 1,22,489.10 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి సాధించామని ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2024లో ఉత్పత్తిలో తెలంగాణకు 50,945.58 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్ 19,091.52 మెట్రిక్ టన్నులు, కర్ణాటక 12,120.84 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్ర 5,982.30 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్ 20,574.54 మెట్రిక్ టన్నులు, తమిళనాడు 8,142.48 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్ 5,631.84 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించడంలో కీలకపాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులు, అధికారులకు అభినందనలు తెలిపారు.

ఇక ఆన్‌లైన్‌లో సీఎంపీఎఫ్ సేవలు

గోదావరిఖని: ఇక నుంచి ఆన్‌లైన్ సీఎంఎఫ్ అందుబాటులో ఉంటాయని బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ కోసం ఆన్‌లైన్ సర్వీస్ (సీ–కేర్స్ పోర్టల్)ను బొగ్గుశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రారంభించారని, ఒక్కక్లిక్‌తో సమాచారం పొందవచ్చన్నారు.



మధ్యాహ్నం తాళంవేసి ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రం



వెనక గేటు నుంచి వెళ్తున్న సిబ్బంది, రోగుల బంధువులు



ఖాళీగా ఉన్న రిసెప్షన్ కుర్చీ



మూసి ఉన్న ఫార్మసీ

ఆస్పత్రికి తాళం.. ఇదేం చోద్యం

ఆస్పత్రి అంటేనే అత్యవసర సేవల విభాగం. నిత్యం రోగులు, వారి బంధువులతో కిటకిటలాడుతుంది. 24గంటల పాటు ఆస్పత్రి ద్వారాలు తెరిచే ఉంటాయి. కానీ.. పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని మాతాశిశు కేంద్రం ద్వారాలు మధ్యాహ్నం ఒంటిగంట కాగానే మూసుకుంటున్నాయి. ఈ విషయమై ఆస్పత్రి అధికారులను ప్రశ్నించగా.. మధ్యాహ్నం ఒంటిగంట వరకే ఓపీ ఉంటుందని, అనంతరం తాళం వేస్తామని తెలిపారు. ఒంటిగంట తరువాత ఎవరైనా వస్తే వెనక గేటు నుంచి రావొచ్చని సమాధానం ఇచ్చారు. లంచ్ తరువాత డ్యూటీ డాక్టర్లు మినహా ఎవరూ అందుబాటులో ఉండరని, ఓపీ ఉండదని, ఇన్‌పేషెంట్లకు ఇబ్బంది ఏర్పడొద్దనే భావనతో తాళం వేస్తున్నామని తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఆస్పత్రికి తాళంతో పాటు సిబ్బంది లేక ఖాళీగా కుర్చీలు, ఫార్మసీ మూసిఉన్న దృశ్యాలు కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

ఇంజినీరింగ్‌లో ఫెయిల్.. యువకుడి ఆత్మహత్య


చరణ్‌తేజ(ఫైల్)

గోదావరిఖని: ఇంజినీరింగ్‌లో ఫెయిలయ్యాననే మనస్తాపంతో పెద్దపల్లి జిల్లా రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని మార్కండేయకాలనీకి చెందిన బర్కం చరణ్‌తేజ(24) గురువారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని గురునానక్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివిన చరణ్‌తేజ పరీక్షల్లో తప్పాననే కారణంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య పేర్కొన్నారు. మృతుడి తండ్రి రవిశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


గుర్రాల రాజు(ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని కూనారం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని హన్మంతునిపేట గ్రామానికి చెందిన గుర్రాల రాజు(26) దుర్మరణం చెందాడు. హిటాచీ కంపెనీలో (ఏటీఎం క్యాష్‌లోడింగ్) పనిచేస్తున్న గుర్రాల రాజు హన్మంతునిపేటలోని తన ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. కూనారం క్రాసింగ్ వద్ద మలుపు తిరుగుతుండగా వేగంగా వచ్చిన వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడని ఏఎస్‌ఐ రవీందర్‌రావు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి


పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో పేకాటస్థావరంపై గురువారం గోదావరిఖనివన్, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు వివరాల ప్రకారం.. సుందిళ్ల గ్రామంలో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఎస్.ప్రమోద్‌రావు, టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఎస్సైలు సుగుణాకర్, వెంకటేశ్, మధుసూదన్ దాడిచేశారు. పేకాడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని, రూ.2,60,320,10 సెల్‌ఫోన్లు, మూడు కార్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు వెల్లడించారు.

టీచర్స్ కాలనీలో చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్‌కాలనీలో బుధవారం చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఎరవెల్లి వేణుగోపాల్‌రావు దంపతులు ఉద్యోగరీత్యా తాళం వేసి వెళ్లారు. వారు వచ్చే సరికి తాళం పగులగొట్టినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 15 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్టు నిర్ధారించుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించి దొంగను గుర్తించినట్టు సమాచారం.

జీవశాస్త్రం.. భవితకు సోపానం

- జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ
- విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శనం
- టెక్ మహీంద్ర సంస్థ సౌజన్యంతో..
- ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ఐదు రోజుల పాటు కార్యక్రమం


కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో జీవశాస్త్రం ఉపాధ్యాయులు

జ్యోతినగర్(రామగుండం): జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ.. విద్యార్థుల భవిష్యత్‌కు సోపానంగా నిలవనుంది. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో ఐదు రోజుల పాటు హైదరాబాద్‌కు చెందిన టెక్ మహీంద్ర సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ శిక్షణలో జిల్లాలోని జీవశాస్త్రం బోధించే ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 45మంది ఉపాధ్యాయులు పలు నూతన అంశాలు నేర్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ఐదురోజుల పాటు..



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బయోలజీలో శిక్షణ ఇస్తున్నాం. ఐదు రోజుల పాటు పెద్దపల్లి జిల్లాలోని 45మంది జీవశాస్త్ర టీచర్లకు శిక్షణ ఇచ్చాం. జీవశాస్త్ర ప్రయోగాలలో తర్ఫీదు పొంది పాఠశాలలోని విద్యార్థులకు నూతన విధానాలతో ప్రయోగాలు వివరించొచ్చు. సైన్స్ విద్యార్థులు మన దేశానికి రక్షణ కవచాలుగా మారేందుకు శిక్షణ ఉపయోగకరంగా ఉంటుంది.

– డాక్టర్ రేవతి, హెచ్‌ఓడీ, టెక్ మహీంద్ర బయోలజీ సైన్స్ విభాగం

ఎంతో ఉపయోగకరం



మహీంద్ర టెక్ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బయోసైన్స్ టీచర్లకు ఐదు రోజులపాటు చక్కటి శిక్షణ ఇచ్చారు. క్షీరదాల మెదడు, మూత్రపిండాలు నిలువు కోత మొదలైనవి ఏ విధంగా చేయాలి..? వాటి బాహ్య నిర్మాణం అంతర నిర్మాణం ఏ విధంగా ఉంటుందో స్వయంగా చూసి తెలుసుకున్నా. నేను మా విద్యార్థులకూ ఇదే విధంగా బోధిస్తాను. తద్వారా పాఠం జీవితాంతం గుర్తుంచుకుంటారు.

– జ్యోతి, జెడ్పీహెచ్‌ఎస్, కుక్కలగూడూరు

పవర్ పాయింట్ ద్వారా..



టెక్ మహీంద్ర సైన్స్ అకాడమీ ఫౌండేషన్ ద్వారా ఐదు రోజుల పాటు జిల్లా జీవశాస్త్ర ఉపాధ్యాయులకు అత్యుత్తమ ప్రయోగాలతో శిక్షణ అందించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు ప్రయోగాలు చేస్తూ బోధించారు. ఈ శిక్షణ సమాజంలో సైన్స్‌స్థానాన్ని బాగా అర్థం చేసుకోవడానికి, సమస్యలు పరిష్కరించే పద్ధతిగా ఉపయోగపడుతుంది.

– గుర్రం అంజన్‌కుమార్, తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు

సులభ పద్ధతిలో ప్రయోగాలు



సులభరీతిలో సరికొత్త ప్రయోగాలు తెలియజేశారు. ఒక పరీక్షనాళికలో చక్కెర ద్రావణం తీసుకొని దానికి ఈస్ట్‌ను కలిపి ఆక్సిజన్ అందకుండా పారాఫిన్ మైనం ఉంచినప్పుడు అవాయు శ్వాసక్రియ జరిగి కార్బన్‌డైయాక్సైడ్ విడుదలై పక్క టెస్ట్‌ట్యూబ్‌లో ఉన్న సున్నపు నీటిని పాలవలె తెల్లగా మారుస్తుంది. ఈ ప్రయోగం చాలా చిన్న పరికరాలతో నిర్వహించడం జరిగింది. తక్కువ ఖర్చుతో చిన్నచిన్న పరికరాలతో ఎన్నో కొత్త ప్రయోగాలు చేయడం నేర్చుకున్నా.

– దొంతుల కుమార్, జెడ్పీహెచ్‌ఎస్, ఏక్లాస్‌పూర్

లక్ష్య సాధనలో అగ్రగామిగా నిలవాలి


మాట్లాడుతున్న ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో ఆర్జీ-1 ఏరియా అగ్రగామిగా నిలవాలని జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో మాట్లాడుతూ ఏరియాలో జనవరిలో 3.97లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గానూ 4.22లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి లక్ష్యానికి మించి 106శాతం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 36.42లక్షల టన్నులకు గానూ 34.60లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల్లో 95శాతం చేరుకున్నట్లు పేర్కొన్నారు. సంస్థ స్థితిగతులపై కార్మికులకు వివరించేందుకు ఈనెల 5నుంచి ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీలు పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, ఫైనాన్స్ డీజీఎం లక్ష్మీబాయి, సివిల్ డీజీఎం నాగేశ్వర్‌రావు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమంలో ముందంజలో...

వార్షిక ఉత్పత్తి లక్ష్యాలతో పాటు సంక్షేమంలో ముందంజలో నిలుస్తున్నామని ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో మాట్లాడుతూ.. వకీల్‌పల్లి భూగర్భ గని 140శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి ఆదర్శంగా నిలిచిందన్నారు. జనవరిలో 9.02లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 10.07లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాలకు మించి 112శాతం సాధించినట్లు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 76.42లక్షల టన్నుల లక్ష్యానికిగాను 74.87లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల సాధనలో 98శాతంలో నిలిచిందన్నారు. మరో రెండు నెలల గడువు మాత్రమే ఉండటంతో ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ప్రతీ ఒక్కరు దృష్టి సారించాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి కోసం కృషి చేయాలన్నారు. రూ.160కోట్లతో ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3లో 6సీహెచ్ సీహెచ్‌పీ వద్ద ప్రత్యేక బంకర్ల నిర్మాణం సాగుతోందన్నారు. ఈ సమావేశంలో అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, బచ్చ రవీందర్, ధనుంజయ, ఎర్రన్న, మురళీక్రిష్ణ, డాక్టర్ మహిపాల్, రామచంద్ర, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్జీ-3లో 113 శాతం, ఏపీఏలో 120శాతం

రామగిరి: జనవరిలో ఆర్జీ-3లో 113శాతం, ఏపీఏలో 120శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీ-3లో నిర్దేశించిన 5.70 లక్షల టన్నులకుగాను 6.42లక్షల టన్నులు మొత్తంగా 113శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. ఏపీఏ గనిలో నిర్దేశించిన 1.49 లక్షల టన్నులకు గాను 1.79 లక్షల టన్నుల ఉత్పత్తితో 120శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు.

ఆస్పత్రుల్లో లైవ్ సర్జరీలు

- మొదటి రోజు ఆర్థోపెడిక్ వైద్యుల రాష్ట్ర సదస్సు


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థో వైద్యులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో మొట్ట మొదటిసారి నిర్వహిస్తున్న 9వ రాష్ట్ర ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సు గురువారం వీ-కన్వెన్షన్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్థో వైద్యులు హాజరయ్యారు. మొదటి రోజు కరీంనగర్‌లోని నాలుగు ఆస్పత్రుల్లో లైవ్ సర్జరీలు నిర్వహించగా, సదస్సుకు హాజరైన వైద్యులు వీక్షించారు. రెనే హాస్పిటల్‌లో ఆర్థోస్కోపీ- టోటల్ హిప్ రీప్లేస్మెంట్ సర్జరీని డాక్టర్ బంగారిస్వామి, చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ డాక్టర్ కేతన్ దేశ్‌పాండే, ప్రతిమ వైద్య కళాశాలలో రోబోటిక్ ద్వారా మోకాలు కీలు మార్పిడి విధానం డాక్టర్ మోతీలాల్, హోటల్ శ్వేత కాన్ఫరెన్స్ హాల్‌లో పెల్విఎసిటాబులం సర్జరీ డాక్టర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని ప్రాంతాల నుంచి లైవ్ కవరేజీ చేపట్టి వైద్యులు, పీజీ విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ప్రారంభ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు, రజనీ ఫెర్టిలిటీ సెంటర్ ఫౌండర్ డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని, కోర్స్ డైరెక్టర్ డాక్టర్ జయప్రసాద్, కో డైరెక్టర్ డాక్టర్ విజయభాస్కర్, ఫ్యాకల్టీ మెంబర్లు శ్రీనివాస్ కాశా, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్ వేముల, సాయి తిరుమలరావు, సుధీర్ ద్వారక్‌నాయుడు, ఉదయ్‌కృష్ణ, సాయిలక్ష్మణ్ అన్నే, కె.వంశీధర్‌రెడ్డి, నర్సింహులు, శివకుమార్, అశోక్‌రాజు, అతుల్, నాగరాజు, ప్రవీణ్, వంశీ ఛాట్ల తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు చోటేది?

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో అసంఘటిత కార్మికులకు చోటు కల్పించలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ఆరోపించారు. గురువారం సుల్తానాబాద్‌లో మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ ఓట్ల బడ్జెట్‌లా ఉందన్నారు. పేదలు, రైతులు, బలహీనవర్గాలకు, అసంఘటిత కార్మికులకు అందని ద్రాక్షగా మారిందని అన్నారు. అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజనవర్కర్లను రెగ్యులరైజ్ చేయకపోవడం విచారకరమన్నారు.

సమ్మె నోటీసు అందించిన సీఐటీయూ నాయకులు


సమ్మెనోటీసు అందిస్తున్న రాజారెడ్డి, నాయకులు

గోదావరిఖని: ఈ నెల 16న జరిగే జాతీయ సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆర్జీ-1 పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబుకు వినతిపత్రం అందించారు. ప్రజలను చైతన్య పరచడానికే సమ్మె చేపడుతున్నట్లు వెల్లడించారు. లాంగ్‌వాల్ యంత్రాల వద్ద అవుట్‌సోర్సింగ్ విధానం నిలిపివేయాలని, రాబోయే ఓసీపీల్లో అవుట్‌సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాలని, సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కార్మికులు ఉంటున్న క్వార్టర్‌ను పర్మినెంట్‌గా కేటాయించాలని కోరారు. కార్మిక కుటుంబాలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, దాసరి సురేశ్, నందినారాయణ, వంగల శివరాంరెడ్డి, వెంకటేశ్వర్లు, సాయిక్రిష్ణ, శ్రీనివాసరావు, సత్యనారాయణరావు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ డిపార్ట్‌మెంట్ మీటింగ్‌పై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న జీఎంలు

రామగిరి: ఫిబ్రవరి 5వ తేదీ నుంచి వివిధ గనులు, విభాగాల్లో నిర్వహించనున్న మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాల ఏర్పాట్లపై గురువారం జీఎం కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులు, అధికారులు, ఉత్తమ ఉద్యోగులతో ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడం, నాణ్యత ప్రమాణాలు పాటించడం, సంక్షేమం, సంస్థ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాల్సిన అంశాలపై చర్చించారు. వివిధ గనుల్లో, విభాగాల్లో ఉద్యోగులకు అవగాహన కల్పించే విధంగా మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ.రావు, బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సమ్మయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్.వెంకటరమణ, ఏరియా ఇంజినీర్లు పీ.ఏలీషా, పి.సీతారామం, ఎస్‌ఓటూ జీఎంలు జీ.రఘుపతి, డి.వైద్య, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.నాగేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

కరీంనగర్: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షం భేష్ అంటుంటే.. విపక్షాలు పెదవి విరిచాయి. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ అని అధికార పక్షం అంటుండగా.. బహుళజాతి సంస్థలు, సంపన్నవర్గాలకు కొమ్ముకాసే బడ్జెట్ అని విపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

ఉద్యోగులకు తీవ్ర నష్టం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులకు పూర్తిగా నిరాశజనకంగా ఉంది. కొత్త, పాత ఆదాయపు పన్ను అంశాల్లో ఏ విధానంలో చూసినా ప్రభుత్వ ఉద్దేశం పన్ను వసూలు చేయడం అనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలి. టాక్సిబుల్ ఇన్‌కంను రూ.7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలి. స్లాబులు కూడా 5శాతం నుంచి ఉండాలి. కానీ ఏకంగా 15 నుంచి 20శాతం విధిస్తున్నారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో ఏనాడు ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ విధానంలో లాభం జరగలేదు.

– ఊకంటి విజయేందర్‌రెడ్డి, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు

నిరాశపర్చింది..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశపర్చింది. రూ.3 లక్షల కోట్లు బడ్జెట్ పెంచి చూపించినా రూ.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు చూపడం దేశ ఆర్థిక పరిస్థితికి నిదర్శనంగా కనిపిస్తుంది. దేశవ్యాప్తంగా కూడు, గూడు, గుడ్డ లేని కోట్లాది మంది నేటికీ ఉన్నారు. వారందరికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్రం విఫలమైంది. నూటికి 60 శాతం ఉన్న రైతాంగాన్ని విస్మరించారు. – మిల్కూరి వాసుదేవారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

విద్యారంగాన్ని విస్మరించారు



కేంద్రం మధ్యంతర బడ్జెట్ విద్యారంగం, తెలంగాణ విద్యార్థి లోకాన్ని పూర్తిగా విస్మరించింది. విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా.. ప్రాధాన్యత నిధులు కూడా ఇవ్వలేదు. కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయాలని విభజన హామీ చట్టంలో ఉన్నా స్థానిక ఎంపీ ట్రిపుల్ ఐటీ తీసుకురావడంలో విఫలమయ్యారు. విద్యార్థులపై భారంగా ఉన్న స్టేషనరీపై జీఎస్టీ ఎత్తివేయకుండా, నిరుద్యోగ యువత ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఈ బడ్జెట్ ఉంది.

– కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రగతిపథంలో నడిపించేది..



పేదలు, రైతు సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. సోలార్ ఎనర్జీని సబ్సిడీల ద్వారా ప్రోత్సహించి ప్రతి కుటుంబానికి కరెంట్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పించే బడ్జెట్. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను ఇచ్చి బడ్జెట్ రూపొందించడం అభినందనీయం.

– పి.సుగుణాకర్‌రావు, బీజేపీ సీనియర్ నాయకుడు

అన్నివర్గాలకు మేలు చేసేలా..



మోదీ ప్రభుత్వం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ లక్ష్యంగా పేదలకు ఇళ్ల నిర్మాణం, రక్షణ, ఉపరితల రవాణా, జాతీయ రహదారులు, రైల్వే, ఆహార ప్రజాపంపిణీ, హోంశాఖ, గ్రామీణాభివృద్ధి, ఎరువులు, రైతుసంక్షేమం, ఆయుష్మాన్ భారత్‌కు పెద్దపీట వేయడం శుభపరిణామం. – గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఇన్‌కం టాక్స్‌లో మార్పులు లేవు



2024–25 సంవత్సరానికి ఇన్‌కం టాక్స్‌లో ఎలాంటి మార్పులు లేవు. ఆదాయ పన్ను స్లాబ్‌ల ప్రకారం రూ.7 లక్షల వరకు కొత్త రిజిన్‌లో సెక్షన్ 87 ఏ ప్రకారం మినహాయింపు ఉంది. పాత టేబుల్ ప్రకారం రూ.5 లక్షల వరకు సెక్షన్ 87ఏ ప్రకారం కార్పొరేట్ పనుల్లో కొంత శాతం తగ్గించడం జరిగింది. సోలార్ పవర్‌ను ప్రోత్సహించడం కొంతవరకు హర్షించదగ్గ విషయం.

– కె.వెంకటేశ్వర్లు, అడ్వకేట్

పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో..



వ్యవసాయరంగ పురోభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ బడ్జెట్‌లో రూ.1.27 లక్షల కోట్లు కేటాయించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కి రూ.7,105 కోట్లు. ఆహారశుద్ధి పరిశ్రమలకు రూ.3,290 కోట్ల కేటాయింపు, ఎరువుల ఖర్చు రూ.3 వేల నుంచి రూ.600 తగ్గించేలా సంప్రదాయ ఎరువుల స్థానంలో నానో డీఏపీని విస్తరించడం, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం వంటి చర్యలు వ్యవసాయ అభివృద్ధికి ఊతమిస్తాయి.

– డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, తెలంగాణ ఎకనామిక్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఇన్‌కంటాక్స్ స్లాబ్ పెంచాలి



కోల్‌సిటీ(రామగుండం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇన్‌కంటాక్స్ స్లాబ్ పెంచాలి. రైల్వేకు గతంలో మాదిరిగా ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలి. ఖాళీలను భర్తీ చేయాలి. మహిళా లోకో పైలట్స్‌కు రైలింజన్‌లో టాయిలెట్స్, ఏసీలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలి.

– అజ్మీరా వీరన్ననాయక్, రామగుండం బ్రాంచ్ సెక్రెటరీ, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్

ఎటువంటి మార్పు లేదు



కోల్‌సిటీ(రామగుండం): ఆదాయ పన్ను చెల్లింపుదారులను బడ్జెట్ నిరాశపరిచింది. గత ఏడాది ప్రకారమే పన్నులు ఉన్నాయి. ఎలాంటి మార్పులు చేయలేదు. బహుళ సెక్షన్ల రాయితీని అనుమతించే పాత పన్ను విధానంలో ఈ బడ్జెట్‌లో ఎటువంటి మార్పు లేదు.

– ఎం.వెంకటేశం, ఇన్‌కంటాక్స్ ప్రాక్టీషనర్, గోదావరిఖని

యథాతథంగా స్లాబ్‌లు



సిరిసిల్లకల్చరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదాయపు పన్ను పరిమితిని ఈసారైనా పెంచుతారని ఆశించారు. వేతన జీవులకు ఈ విషయంలో నిరాశే మిగిలింది. పన్ను పరిమితిని పెంచాలని ఎన్నో ఏళ్లుగా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపు పన్ను స్లాబ్‌లు యథాతథంగా ఉంచుతున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. ఇది వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది. – పాకాల శంకర్‌గౌడ్, టీఎస్‌యూటీఎస్ అధ్యక్షుడు

విద్యకు కేటాయింపులు సరిపోవు



సిరిసిల్లకల్చరల్: బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించింది ఏ మాత్రం సరిపోదు. మొత్తం బడ్జెట్‌లో 2.61 శాతం మాత్రమే కేటాయించడం విద్యారంగ ప్రమాణాలు మెరుగుపరచదు. నినాదాలు, ఉపన్యాసాలతో ప్రామాణిక విద్య సాధ్యం కాదు. నిధుల కొరతతో కొత్త సంస్థల స్థాపన వీలుకాదు. మరిన్ని విద్యావకాశాలు పెంచేలా కేటాయింపులు ఉండాలి.

– దోర్నాల భూపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఏ మార్పు చేయలేదు



సిరిసిల్లటౌన్: ఐటీ తదితర పన్నుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇది సామాన్యులపై ఎలాంటి ప్రభావం చూపదు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దేశ భద్రత, దేశీయ టూరిజానికి ప్రాధాన్యత ఇచ్చారు. కమ్యూనికేషన్స్ వ్యవస్థ, టెంపుల్ టౌన్స్ అభివృద్ధికి నిధులు కేటాయించడం ఆహ్వానించదగిన అంశం.

– జిందం రమేశ్, టాక్స్ కన్సల్టెంట్, సిరిసిల్ల

అనుకూల అంశాలను చేర్చాలి



సిరిసిల్లటౌన్: ఆదాయ పన్ను స్లాబుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. పన్నుల మినహాయింపుల అంశంలో మధ్య తరగతి ఉద్యోగుల ఆశలు అడియాసలయ్యాయి. జనరల్ బడ్జెట్‌లోనైనా ఉద్యోగులకు అనుకూల అంశాలను చేర్చాలి. – మిట్టపల్లి ప్రశాంత్‌కుమార్, టీఎస్‌పీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి

టెక్స్‌టైల్ రంగానికి నిధులేవి ?



సిరిసిల్లటౌన్: దేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగమైన టెక్స్‌టైల్‌కు నిరాశ కలిగించిన బడ్జెట్ ఇది. వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ కేటాయిస్తారన్న కార్మికుల ఆశలు గల్లంతు చేశారు. పరిశ్రమ సంక్షోభం నుంచి గట్టెక్కే అంశాలు ఏమాత్రం లేవు. కార్మికులు, శ్రమజీవులకు ప్రాధాన్యత లేదు. – కోడం రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి